# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## కుప్పంలో తెలుగుదేశం పార్టీ
# 'లక్షే లక్ష్యం'కు ప్రణాళిక

### అధినేత చంద్రబాబుకు భారీ మెజార్టీ సాధనే ధ్యేయం .. ఇదేం ఖర్మ ముగిసాక మరోమారు జనంలోకి !!



కుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త

రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన కుప్పం నియోజకవర్గం నుంచి ప్రతిపక్ష నేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం విదితమే. 1989 సం॥ మొదలు 2019 అసెంబ్లీ ఎన్నికల దాకా చంద్రబాబునాయుడు ఏడు సార్లు ఘన విజయం సాధించి కుప్పం శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024 ఎన్నికల్లో మరలా కుప్పం నుంచి తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు పోటీ చేయడం ఖాయమే. అయితే జరగనున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుకు కుప్పంలో లక్ష మెజార్టీ సాధించేందుకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో చంద్రబాబుకు ముప్పై వేల మెజార్టీ రావడం పట్ల అప్పట్లో అధినేత చం ద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కుప్పంలో ఈసారి చంద్రబాబునాయుడుకు లక్ష ఓట్ల మెజార్టీ సాధించేందుకు గాను తెలుగుదేశం పార్టీ శ్రేణులు మరోమారు నియోజక వర్గంలోని ప్రతి గడప తొక్కేందుకు సన్నద్ధులవుతున్నారు. ఇప్పటికే పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే దేశం శ్రేణులు కుప్పంలో 'లక్షే లక్ష్యం' పేరిట కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. కుప్పం నియోజకవర్గంలో ప్రస్తుతం 2.20లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో తెదేపా అధినేతకు లక్ష మెజార్టీ ఖచ్చితంగా సాధించాలని ఆ పార్టీ శ్రేణులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రధానంగా కుప్పంలో చంద్రబాబు నాయుడు శాసనసభ్యులుగా, ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో జరిగిన 'అభివృద్ధి' కార్యక్రమాలనే ప్రజల్లో బలంగా తీసుకెళ్లడంతో పాటు చంద్ర బాబునాయుడుతోనే కుప్పం అభివృద్ధి సాధ్యం అనే నినాదంతో దేశం శ్రేణులు మరలా జనంలోకి పోవాలని నిర్ణయించుకున్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధిని 'కరపత్రాల'రూపంలో ప్రజలకు అందించి వారి ఓట్లను అభ్యర్థి ంచాలని ప్రణాళిక రచించినట్లు సమాచారం. పార్టీ ముఖ్యనేతలతో పాటు తెలుగుయువత, మహిళ విభాగం, ఐటిడిపి, బూత్, ఏరియా, యూనిట్ కమిటీలు,ఇతర అనుబంధ విభాగాలు కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనకు సిద్ధమవుతున్నారు.

## శ్రీపల్లికొండేశ్వరస్వామి సేవలో మంత్రి పెద్దిరెడ్డి

నాగలాపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:



సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వరాలయంను రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలతతో కలిసి ఆదివారం సందర్శించారు. శ్రీపల్లికొండేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు సంఛార పూజలలో పాల్గొని శ్రీదంపతీ సమేత దక్షణా మూర్తి స్వామి వారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దూప, దీప, నైవేద్యాలను నివేదించి మ్రొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిమూలం, ఆలయ ఛైర్మేన్ ఏవియం బాలాజీ రెడ్డి లు పెద్దిరెడ్డి ని సత్కరించి, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

# చంద్రగిరిపై 'పట్టు' కోసం పాట్లు!

### వైసిపి, టిడిపి హుషారుగా జనంలోకి !!

ప్రభాతవార్త–తిరుపతి:



తిరుపతి జిల్లాలో చంద్రగిరి నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. టిడిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వగ్రామం ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉండటం....1978లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చంద్రగిరి నుంచే పోటీచేసిన చంద్రబాబు ఎమ్మెల్యే అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ 2014వ సంవత్సరం నుంచి వైసిపి తరపున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన నియోజకవర్గ ప్రజలకు కుటుంబ సభ్యుడిగా మారిపోయారు. ఆయన అందించిన సేవా కార్యక్రమాలు, కరోనా సమయంలో ప్రజలకు చేరువై వారికి అవసరమైన నిత్యావసరసరుకులు, ఆయుర్వేద మందులు,పర్వదినాల్లో ఉదారత చూపుతూ కుటుంబ సభ్యుడిగా నిలిచిపోయారు. వైసిపి తరపున గెలిచిన డాక్టర్ చెవిరెడ్డి తొలిసారిగానే తుడ ఛైర్మన్ పదవితోబాటు ప్రభుత్వ విప్‌గా, టిటిడి బోర్డు సభ్యుడుగా కూడా కొనసాగుతున్నారు. తుడ పరిధిలోకి నియోజకవర్గంలోని కొన్ని మండలాలను విలీనం చేసుకుని పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఎవరికి కష్టమొచ్చినా తనను కలసిన వారికి తనవంతుగా సాయం అందిస్తూ ఓటుబ్యాంకును పదిలంచేసుకున్నారు. ఇప్పుడు చంద్రగిరి నియోజకవర్గం రాష్ట్రంలోనే ఒక ప్రాధాన్యతగా నిలిచింది. ఇక్కడ రానున్న ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నేతలు అదే స్థాయిలో ప్రజలకు చేరువయ్యేందుకు పాదయాత్రలు మొదలుపెట్టేశారు. ఎవరికి ఏ కష్టం ఉన్నా వెంటనే పరిష్కరించే దిశగా చొరవతీసుకుంటున్నారు. ఇరుపార్టీల నేతలు జనంలోకి హుషారుగా వెళుతున్నారు. ఇదే సమయంలో చంద్రగిరి బరిలో రానున్న ఎన్నికల్లో వైసిపి తరపున చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు ప్రస్తుత రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారైంది. టిడిపి నుంచి కూడా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తినాని పోటీ దాదాపు ఖరారైంది. 2019 ఎన్నికల్లో నాని పోటీచేసి 42,755 ఓట్ల భారీ తేడాతో ఓటమిపాలయ్యారు. అయితే ఈ సారి ఎన్నికల్లో పట్టుసాధించేందుకు జనంతో మమేకమై మరింతగా కష్టపడుతున్నారు. పార్టీ శ్రేణులను కూడా తనవారిగా మార్చుకుని కలసి ముందుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు పార్టీల నుంచి బలమైన నేతలు రంగంలో దిగడంతో ప్రజల మద్దతు చూరగొనేందుకు ఎవరికివారే ప్రయత్నాలు మొదలు పెట్టారు. 1983 ఎన్నికల్లో చంద్రబాబు చంద్రగిరిలో టిడిపి అభ్యర్థి వెంకట్రామనాయుడు చేతిలో ఓడిపోయారు. 1989నుంచి కుప్పంలో బాబు వరుస విజయాలు సొంతం చేసుకుంటున్నారు. అయితే తన సొంత నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిని గెలిపించుకోలేకపోతూనానరు. 1989లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన గల్లా అరుణకుమారి ఎమ్మెల్యే అయ్యారు. 1994లో ఒకసారి అప్పటి పరిస్థితుల్లో టిడిపి ఎమ్మెల్యేగా నారా రామ్మూర్తినాయుడు విజయం సాధించారు. ఆ తరువాత మూడుసార్లు వరుసగా గల్లా అరుణకుమారి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించారు. 2014లో ఈమె టిడిపిలో చేరి పోటీచేయడంతో ఓడిపోయారు. ప్రస్తుతం చంద్రగిరిలో ప్రజాభిమానంతో పట్టుసాధించుకునేందుకు అటు టిడిపి ఇటు వైసిపి తమతమ ప్రయత్నాలు మొదలుపెట్టేశారు.

## విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి



విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన మేఘనాథం, సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ,ఎస్సై

తవణంపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

అడవి జంతువుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగులుకుని విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని ఎం.బోయపల్లె వద్ద శనివారం రాత్రి జరిగింది. సంఘటనకు సంబందించి వివరాలిలావున్నాయి. మాధవరం గ్రామ సమీపంలోని ఓ రైతు మామిడి తోటలో గుర్తు తెలియని వ్యక్తులు అడవి జంతువుల వేట కోసం విద్యుత్ తీగలను అమర్చారు.ఈనేపథ్యంలో ఎం.బోయపల్లెకు చెందిన టి.మేఘనాథన్(39) అనే వ్యక్తి తప్పిపోయిన తమ పాడి ఆవు కోసం వెతుకుగుండగా అడవి జంతువుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగులుకుని విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడడే మృతి చెందాడు. ఈవిషయాన్ని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం ఉదయం కనుగొని గ్రామస్థులకు సమాచారం అందించారు. దీనితో మృతుని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, స్థానిక ఎస్సై సుధాకర్‌రెడ్డి, అరగొండ ట్రాన్స్‌కో ఏఈ కిషోర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



## కన్నులపండువగా గురుదక్షిణామూర్తి గ్రామోత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆదివారం గురుసంక్రమణ సందర్బంగా ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమాలకు విశేష స్పందన వచ్చింది, నవగ్రహాల్లో పంచమ గ్రహమైన గురు గ్రహం, మీన రాశి నుంచి మేష రాశిలోకి ప్రవేశించు శుభ సమయాన దక్షిణామూర్తి ఆలయం వద్ద ఉదయం 9గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా ఆలయ ప్రదానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ సారధ్యంలో ఆలయ పారోహితులు అర్ధగిరి వేదమంత్రాలను పఠిస్తుండగా ఇక్కడి సంప్రదాయం మేరకు పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా మొదట కలశాలను ఏర్పాటు చేసి ఆవాహన గావించారు. తరువాత హోమాలను ఏర్పాటు చేసారు. ఇక ఇక్కడ 108 శంఖాలలో ఉన్న పవిత్ర జలాలతో దక్షిణామూర్తిస్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేపట్టారు. అనంతరం రాత్రి దక్షిణామూర్తి ఉత్సవ విగ్రహానికి విశేషఅంకరణ చేపట్టి గ్రామోత్సవాన్నినిర్వహించారు.

# వడగండ్ల వర్షం

### నేలకొరిగిన విద్యుత్ స్తంభం, చెట్లు - ధ్వంసమైన రేకుల ఇండ్లు



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

వెదురుకుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :

బలమైన ఈదురు గాలులకు పెద్ద విద్యుత్ స్తంభం, వృక్షాలు నేల కొరగడంతో పాటు రేకుల ఇండ్లు ధ్వంసం కావడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభం విరిగి పడిపోడిన ఘటనలో పెనుప్రమాదం తప్పిదని స్థానికులు ఊపిరి పీచ్చుకున్నారు. స్థానికుల కథనం మేరకు .... మండలంలో సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో దేవళంపేట, తిరుమలయ్యపల్లె, దేవరగుడిపల్లె, తెల్లగుండ్లపల్లె, సోమేంద్రపురం, గొడుగుచింత పరిసర ప్రాంతాలల్లో బలంగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన ఆకస్మిక వర్షం సంభవించడం జరిగింది. ఆ సమయంలో తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోని సుందరాంగనపల్లె సమీపంలో ఏర్పాటు చేసిన పెద్ద లైన్ విద్యుత్ స్తంభం బలమైన ఈదురు గాలులకు నేలకొరగడం జరిగిందన్నారు. ప్రమాద సమయంలో ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే బలంగా వచ్చిన గాలులకు గుర్రం వారికండిగ ప్రాథమిక పాఠశాల వద్దగల మర్రి చెట్టు విరిగిన్నట్లు చెప్పారు. సుందరాంగనపల్లె హరిజనవాడలో పలువురి రేకుల ఇండ్లు పై కప్పులు గాలికి ఎగిరిపోవడంతో వస్తుసామాగ్రి ధ్వంసం అయిందన్నారు. మామిడి, వరి పంటలు నష్టంతో రైతులు ఆవేదన చెందారు. గొడుగుచింత పంచాయితీ పరిధిలోని సోమేంద్రపురం జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు బలమైన గాలికి ధ్వంసమైనట్లు చెప్పారు. ప్రభుత్వ అధికారులు స్పందించి నష్టంను అంచనా వేసి బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.



ధ్వంసమైన రేకుల ఇండ్లు

### మనస్ఫూర్తిగా విధులు నిర్వర్తించినప్పుడే
# ఉద్యోగ సంతృప్తి

### పోలీస్ అధికారులతో డిఐజి అమ్మిరెడ్డి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం రేంజ్ డిఐజీ అమ్మిరెడ్డి

తిరుపతి క్రైం,ఏప్రిల్ 23 ప్రభాతవార్త

చట్టబద్ధంగా మనస్ఫూర్తిగా విధులను నిర్వర్తించినప్పుడే ఉద్యోగ సంతృప్తి ఉంటుందని అనంతపురం రేంజ్ డిఐజీ అమ్మిరెడ్డి అన్నారు. ఆదివారం మహిళ యూనివర్సిటీ సావేరి సమావేశం మందిరంలో తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డితో కలిసి పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్ విభజన తర్వాత తిరుపతి జిల్లా రాష్ట్రం లోని పెద్ద జిల్లాగా అవతరించిందని తిరుమల పుణ్యక్షేత్రంతో పాటు వాణిజ్య హబ్ అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఎన్నో విభాగాలన్నీ ఉన్నాయని పోలీసులు ఛాలెంజ్‌గా విధులు నిర్వహిం చాలని తెలిపారు. తిరుపతి నగర పోలీసులు పనితీరు దేశానికి ఆదర్శం కావాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తూ ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సంపూర్ణన్యాయం జరుగుతుందని నమ్మకం పోలీసులు కల్పించాలన్నారు. జరగకముందే నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. మారుతున్న నేరాలకు అనుగుణంగా విజిబుల్ పోలీసింగ్ బీట్ వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఎమ్మెస్‌కేల ద్వారా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. శేషాచల కొండలు తిరుపతి జిల్లాలోని ఉన్నందువలన అక్రమ రవాణా అరికట్టేందుకు పెద్దపీట వేయాలని సూచించారు. ఎన్‌డిపిఎస్ కేసులపై ప్రాణానికి రచించి మూలాలతో సహా దర్యాప్తు చేసి కఠిన శిక్ష పడేలా కేసు నమోదు చేయాలని సూచించారు. రౌడీషీటర్స్, సస్పెక్ట్, పాత నేరస్థులకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, విమలకుమారి మునిరామయ్య, సేబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, ఎస్‌బిడిఎస్‌పి సురేందర్ రెడ్డి జిల్లాలోని డిఎస్పిలు, సిఐలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో
# గాలివాన బీభత్సం

కాణిపాకం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం పరిసరాల్లో ఆదివారం కురసిన భారీ పెనుగాలులతో కూడిన వడగండ్ల వర్షం భీభత్సం సృష్టించింది. ఆదివారం సాయంత్రం కాణిపాకం పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ పెనుగాలలతో కూడిన వడడండ్ల వర్షం కురిసింది. ఈసందర్భంగా ఆలయ పరిసరాల్లో వున్న చెట్లు పెనుగాలులకు నేల కూలాయి. దేవస్థానం ప్రాంగణంలోని వంద అడుగుల రోడ్డులో వున్న చెట్లు విగిరి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీనితో భక్తుల రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే గాలులకు ఒక చెట్టు కూలి పక్కనున్న రేకుల షెడ్డుపై పడడంతో రేకుల షెడ్డు దెబ్బతింది. పెనుగాలులతో కూడిన వర్షం కారణంగా కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా వుండగా వర్షం సందర్భంగా కాణిపాకం పరిసర ప్రాంతాలలో వీచిన పెనుగాలులతో రైతులు సాగు చేస్తున్న మామిడి పంట నేలరాలింది. మామిడి తోటల్లో టన్నుల కొద్ది మామిడి కాయలు నేలరాలడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. ఈఏడాది పలు రకాల తెగుళ్ళ కారణంగా పంట దిగుబడి అంతంత మాత్రంగా వుండగా వున్న పంట కూడా పక్వ దశకు వస్తున్న సమయంలో పెనుగాలులకు



నేలరాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వర్షం సందర్భంగా వీచిన పెనుగాలుల కారణంగా మండలంలో ఐరాల మండలంలోని పలు ప్రాంతాలలో రైతు సాగు చేస్తున్న పలు

### ఎమ్మెల్యే ఎంఎస్ బాబుపై
# అసంతృప్తి సెగ

### పదవులు ఇప్పిస్తానని సొంత పార్టీ నేతల నుండి భారీగా ముడుపులు! - ఉద్యోగుల బదిలీ సిఫార్సుల్లో సైతం వసూళ్ళు

చిత్తూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

వైకాపా అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో మరోసారి విజయం సాధించడానికి వైనాట్ 175 నినాదంతో ఓ వైపు దూసుకెళ్తుంటే మరోవైపు పూతలపట్టు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు, ఉద్యోగుల బదిలీల కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేకు ముడుపులు చెల్లించుకొనే పరిస్థితి నెలకొంది. నామినేటెడ్ పదవులు, ఉద్యోగల బదిలీల కోసం కొంతమంది నుండి ముడపులు తీసుకొని ఇప్పటి వరకు పదవులు, బదిలీలు చేపట్టకపోవడంతో ఎమ్మెల్యేకు ముడుపులు ఇచ్చిన వారు ఆయన చుట్టు ప్రదిక్షిణలు చేసే పరిస్థితి నెలకొంది. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలు చేస్తుంటే పూతల పట్టు నియోజకవర్గంలో మాత్రం ప్రజల్లో పార్టీ పరిస్థితి ఎలా వున్నప్పటికీ మెజార్టీ నాయకులు మాత్రం ఎమ్మెల్యే ఎంఎస్ బాబుపై తీవ్ర అసంతృప్తి వెళ్ళగక్కుతున్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు మెజార్టీ నాయకులు తూతూ మంత్రంగా పాల్గొనే పరిస్థితి ఏర్పడింది. ఏదేని సిఫార్సు కోసం ఎమ్మెల్యే వద్దకు ఎవరైనా వస్తే వారిని తీసుకెళ్ళి ఎమ్మెల్యేతో మాట్లాడించడానికి అధికార వైకాపా నాయకులు భయపడిపోతున్నారు. నాయకులతో కలిసి వెళ్ళినా సిఫార్సు లేఖలు ఇవ్వడానికి ఖర్చవుతుందని ఎమ్మెల్యే అనుచరులు స్పష్టం చేస్తుండటంతో నాయకులు ఎవ్వరు సిఫార్సుల కోసం ఎవ్వరిని తీసుకెళ్ళని పరిస్థితి నెలకొంది. నామినేటెడ్ పదవుల కోసం, బదిలీల కోసం ముడుపులు చెల్లించుకొని పనులు కాక ఇప్పటికీ పలువురు నాయకులు, ఉగ్యోగులు ఎమ్మెల్యే చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ పరిధిలో ఐరాల మండల వైకాపా నాయకులు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుపై అసంతృప్తి వెళ్ళగక్కుతూ పత్రికలకు ఎక్కడంతో మిగిలిన మండలాల్లో సైతం ఎమ్మెల్యేపై వ్యతిరేకంగా గళం విప్పడానికి నాయకులు సిద్దం అవుతున్నారు. ఎమ్మెల్యే తన పనితీరు మార్చుకోకుంటే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేస్తామని ఐరాల మండల వైకాపా నాయకులు పత్రికాముఖంగా పేర్కొన్నారు.ఐరాల జడ్పీటిసీ సుచిత్ర కన్నయ్య నాయుడుకు కాణిపాకం దేవాలయ ఛైర్మన్ లేదా జడ్పీ వైస్ ఛైర్మన్ ఇప్పిస్తానని ఆమె నుండి భారీగా ముడుపులు తీసుకొని ఇద్దరి మధ్య జరిగిన వాగ్వివాదం గతంలో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. అలాగే రెండేళ్ళ క్రితం జరిగిన ఎంపిటిసీ ఎన్నికల్లో ఐరాల ఎంపిపి పదవి ఇప్పిస్తానని ఓ ఎంపిటిసీ నుండి ముడుపులు తీసుకొని అతనికి హ్యాండ్ ఇచ్చినట్లు ఆరోపణలు వున్నాయి. అలాగే జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవుల్లో ఒక్క బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి మాత్రం ఎస్సీలకు రిజర్వ్ చేశారు. బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని ముందు యాదమరి మాజీ జడ్పీటిసీ మనోహరన్ భార్య సెల్వికి ఖరారు చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పేరు ఖరారు కావడంతో సెల్వి పదవి బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధమయ్యారు. అయితే ఎమ్మెల్యే వారిని పిలిచి ఛైర్మన్ పదవి కావాలంటే కొంత మొత్తం సమర్పించుకోవాల్సి వుంటుందని స్పష్టం చేయడంతో వారు పార్టీకి చేసిన సేవను గుర్తించి తమకు పదవి ఇవ్వాలని డబ్బులు చెల్లించి పదవులు తీసుకోవడం తమకు అవసరం లేదని స్పష్టం చేసి వెనుతిరిగారు. అంతే అప్పటికప్పుడు రిజర్వేషన్లను మార్చి వేశారు. జిల్లాలో ప్రస్తుతం వున్న మార్కెట్ కమిటీ చైర్మన్లలో ఎస్సీ వర్గానికి ఒక్క పదవి ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ మహిళకు రిజర్వ్ అయిన బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని బీసీ జనరల్‌కు మార్పు చేశారు. ఆపై బంగారుపాళ్యం మండలానికి చెందిన వారి నుండి ముడుపులు తీసుకొని ఆ పదవిని కట్టబెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. ఇక ఉద్యోగుల బదిలీ సిఫార్సు లేఖలు ఇవ్వడంలో సైతం వారి నుండి ఎమ్మెల్యే కార్యాలయం భారీగా ముడుపులు తీసుకొని బదిలీలు సైతం చేయలేని పరిస్థితి నెలకొంది. బంగారుపాళ్యం తహసిల్దారు కార్యాలయంలో కాంటాక్ట్ బేసిస్ కింద తొమ్మిది నెలలుగా ఓ కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నాడు. సాధారణంగా కాంటాక్ట్ పద్ధతిలో కొనసాగించాలి. ప్రస్తుతం తహసిల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌ను కొనసాగించడానికి పై స్థాయి నుండి కింది స్థాయి రెవెన్యూ అధికారులు సిద్ధంగా వున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఒకరి నుండి కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు ఇప్పిస్తానని ముడుపులు తీసుకొని అతని పేరును సిఫార్సు చేయడంతో ప్రస్తుతం తొమ్మిది నెలలుగా జీతం లేకుండా విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై ఎమ్మెల్యేని బంగారుపాళ్యం మండల వైకాపా నాయకులు పలుమార్లు చెప్పినా అదేమి కాదులే! చేస్తానులే! అంటున్నట్లు తెలిసింది.

## సమస్యలను పరిష్కరించడం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడం కోసమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గంగనపల్లిలో ఆదివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాల లబ్దిదారుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అలాగే పథకాలకు అర్హులై వుండి మంజూరు కాకుండా వుంటే ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు సత్వరం సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్మన్ పురుషోత్తండ్డి, 33వ డివిజన్ ఇన్‌ఛార్జ్ గుర్రప్ప, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞనజగదీష్, కో-అప్షన్ సభ్యుడు కోలా ఆనంద్, వైకాపా నాయకులు వినాయక, బాలాజీ, రఘురామ్, త్యాగ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల కోసం ప్రత్యేక తొట్టెలు

పాలసముద్రం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల దాహార్తి తీర్చడం కోసం ప్రత్యేక తొట్టెలను ఏర్పాటు చేశారు. బీట్ ఆఫీసర్ సుభాషిణి మాట్లాడుతూ ఎవరు అడవికి నిప్పు పెట్టరాదని, నిప్పు పెట్టడంతో వన్యప్రాణులు చాలా వరకు మృతి చెందుతున్నాయన్నారు. వన్య ప్రాణులకు అడవిలో తాగడానికి నీరు లభ్యం కాకపోవడంతో సమీప ప్రాంతాల్లోని పొలాలకు, గ్రామాలకు వస్తున్నాయని ఈ విషయంపై అటవీ శాఖ వన్య ప్రాణుల దాహార్తిని తీర్చడానికి అటవీ ప్రాంతాల్లోనే అక్కడక్కడ తొట్టెలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

## నేడు మున్సిపల్ స్పందన

చిత్తూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారులకు విన్నవించుకొంటే వాటిని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటారన్నారు. అలాగే ప్రతి వార్డు సచివాలయం పరిధిలో సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు వార్డు కార్యదర్శులు విధిగా స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు.

## వైకాపా నాయకులు నియంతల్లా వ్యవహరిస్తే సహించేది లేదు

-పట్టణ అధ్యక్షుడు విజయకుమార్

.శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుపై రాళ్ళదాడిచేసి వైకాపా నాయకులు నియంతల్లా వ్యవహరిస్తే సహించేది లేదని పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై వైసిపి మూకల రాళ్ళదాడిని ఖండించారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో చంద్రబాబు బహిరంగసభా స్థలి వద్దకు రోడ్ షోగా వస్తుండగా వైసిపి మంత్రి ఆదిమూలపు సురేష్ మరియు ఆయన అనుచరులు చంద్రబాబుపై రాళ్ళదాడికి పాల్పడ్డారని హఠాత్తుగా జరిగిన ఈఘటనతో చంద్రబాబుకు రక్షణగా ఉన్న ఎన్ఎస్‌జి కమాండర్లు వెంటనే అప్రమత్తమై రక్షణగా నిలబడడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారన్నారు. వైసిపికి చెందిన కొంతమంది రౌడీలు చంద్రబాబునాయుడు కాన్వాయ్‌పై రాళ్ళుదాడిచేస్తున్నా పోలీసులు చోద్యం చూస్తూ కూర్చున్నారే కానీ వారిని కనీసం ఆపే ప్రయత్నం కూడా చేయడం సిగ్గుచేటన్నారు. రానున్న 2024ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## పెద్దపంజాణి ఎస్సైగా శ్రీనివాసులు.

పెద్దపంజాణి ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



మండల కేంద్రం పోలీస్‌స్టేషన్‌లో ఆధివారం నూతన ఎస్సైగా టి.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు.ఆయన గతంలో చిత్తూరు జిల్లా కేంద్రంలో రహదారి భద్రతా విభాగంలో ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చారు.గతంలో పెద్దపంజాణి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన స్వర్ణతేజ అనంతపురం జిల్లా పోలీస్‌స్టేషన్‌కు బదిలీకావడంజరిగింది.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీనివాసులు మాట్లాడుతూ..చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,అదేక్రమంలో మండలంలో అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని ఆయన తెలిపారు.

## నేడు వెలుగు కార్యాలయంలో చిరుధాన్యాల వంటకాల ప్రదర్శన

వెదురుకుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన కార్యక్రమం సోమవారం ఉంటుందని ఎపియం కవిత ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు వెలుగు కార్యాలయ ప్రాంగణంలో చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాల ప్రదర్శనతో వాటి వలన అందే పోషక విలువల పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమంకు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కుప్పంరూరల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



మండలంలోని మోట్లచేను, కూసూరు, కాలనూరు, బొగ్గుపల్లి గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత సిద్ధాంతాలపై ప్రచారం చేపట్టారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన ఈ గ్రంథాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కృష్ణ, శరవణ, నాగరాజు, శివకృష్ణ, మంజునాథ శెట్టి, కృష్ణన్న, చరణ్, ఇందిర, జలజాక్షి, వెంకటలక్ష్మి, రాధ, బిందు, యశస్విని పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనరసింహస్వామి.. శ్రీ మల్లేశ్వరస్వామి జాతర

కుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



మండలంలోని గుడ్లనాయనపల్లి పంచాయతీ ఊరినాయనపల్లి గ్రామంలో శ్రీ నరసింహస్వామి, శ్రీ మల్లేశ్వరస్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించారు. అనంతరం పుష్పపల్లకిలో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ఈసందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు సమర్పించారు. గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## 2024 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఆప్ పోటీ

ఆప్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ మణినాయుడు

చిత్తూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:




2024 సంవత్సరంలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆప్ పార్టీ రాష్ట్రంలోని అన్ని స్థానాల నుండి పోటీ చేస్తోందని ఆప్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ మణినాయుడు పేర్కొన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజలు ఆప్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఇప్పటికే ఢిల్లీ, చత్తీస్‌ఘడ్, గోవా రాష్ట్రాల్లో ఆప్ పార్టీ అధికారంలో వుందని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆప్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసి తన సత్తా చాటుతుందన్నారు. ఈ క్రమంలో రెండు మూడు నెలల్లో ఆప్ పార్టీకి సంబంధించి బూత్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని పదవులను భర్తీ చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆప్ సభ్యులు వెంకటాచలపతి, ఆర్‌కె పట్నం నరేష్, వెంకటేష్, అనురాధ, రాజేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలీస్ స్పందన

చిత్తూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు పాత జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటల నుండి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ రిశాంత్‌రెడ్డికి విన్నవించుకొంటే వాటిని ఎస్పీ పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన సాంబశివరావు అనే భక్తుడు నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెంటెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## 35 మంది శస్త్ర చికిత్సలకు ఎంపిక

సదుం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



సదుంలోని శ్రీసుబ్రమణ్యస్వామి వారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 200 మంది రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులను ఉచితంగా అందజేశారు. అదేవిధంగా 35 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి తిరుపతిలోని అరవింద్ వెంకటేశ్వర నేత్రవైద్యశాలలో ఆపరేషన్లు చేసి తిరిగి ఇంటి వద్ద దింపనున్నట్లు నిర్వాహక అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. ఈశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అరవింద్ కంటి వైద్యశాల వైద్యులు, సిబ్బంది, సుబ్రమణ్యస్వామివారి ఆలయ కమిటీ సభ్యులు మేస్త్రీ రాజన్న,శ్రీరాములు,మురళీ,మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామయ్య,దొంతిశంకరయ్య,సదుం మండల ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అదనపు పోషకాహారంతో ఆరోగ్యం పదిలం

సదుం,ఏప్రిల్ 23 ప్రభాతవార్త



రోగులకు ఇస్తున్న అదనపు పోషకాహారంతో వారి ఆరోగ్యం పదిల పడుతుందని కమ్యూనిటీ వైద్యశాల చైర్మెన్ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ఆదివారం లయన్స్‌క్లబ వారి సౌజన్యంతో క్షయ వ్యాధి [illegible] అదనపు పోషకాహారాన్ని ఉచితంగా పంపిణీచేశారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మానవతా సాయాన్ని అందరు గుర్తుపెట్టుకోవాలన్నారు. అదేవిధంగా అందజేసిన పౌష్టికాహారాన్ని ఇతరులకు ఇవ్వకుండా తామే తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో చెరకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి గిరీషా, వైద్యశాల కమిటి సభ్యులు రమాదేవి,మురళీ,ఆరోగ్య విస్తరణాధికారి ఉదయభాస్కర్,సీహెచ్‌ఓ నీలకంఠ,వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## పల్లెల్లో ఊరేగిన సీతారాములు

చౌడేపల్లి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



పందిళ్ళపల్లి పంచాయతీ నడుమూరులోని ఆంజనేయస్వామి తిరుణాళ్ళను ఘనంగా నిర్వహించారు.

ఉదయాన్నే అర్చకులు స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. అనంతరం లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. చుక్కావారిపల్లి, పందిళ్ళపల్లి, బాలసముద్రం, రాజులిండ్లు, దేవరగుడిపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో పండుగ

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సొంతూరులో గడప గడపకు

- ఎమ్మెల్యే కిలివేటికి బ్రహ్మరథం

తడ, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



సూళ్లూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్యకు స్వగ్రామం కాదలూరులో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆదివారం తడ మండలం కాదలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంజీవయ్య పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి అధికార పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. సూళ్లూరుపేటలోని క్యాంప్ కార్యాలయం నుంచి కాదలూరుకు మోటార్‌సైకిళ్లతో ప్రదర్శన చేశారు. కాదలూరు సర్పంచ్‌గా ఎమ్మెల్యే తల్లి కిలివేటి మస్తానమ్మ ఉన్నారు. ఆమెతో పాటు ఎమ్మెల్యే సోదరుడు విజయ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్థులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాదలూరు పంచాయతీని ఇటీవల ప్రభుత్వం స్వచ్ఛత పరిశుభ్రతలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసింది. స్వగ్రామాన్ని మరిన్ని నిధులతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తడ మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గూడూరులో నిలపాలి

- తిరుపతి జిల్లా టీడీపీ కార్యదర్శి తీగల సురేష్‌బాబు

కోట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



ఆధునిక హంగులు, అధునాతన టెక్నాలజీతో రూపుదిద్దుకొని తిరుపతి-సికింద్రాబాద్ మధ్య అత్యంత వేగంతో ప్రయాణించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను గూడూరు రైల్వేజంక్షన్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తీగల సురేష్‌బాబు, కోట పట్టణ అధ్యక్షుడు షేక్ షంషుద్దిన్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు ఆదివారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ స్వదేశీ టెక్నాలజీతో అత్యధిక వేగంతో విమాన ప్రయాణ అనుభూతిని కలిగించే వసతులతో తొలిసారిగా దేశంలో పట్టాలపై పరుగులు తీసే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో గర్వకారణమన్నారు. ఇన్ని ఆధునిక హంగులు, సౌకర్యాలు కలిగిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ భారత్‌లో రూపుదిద్దుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గూడూరులో నిలుపుదల లేకపోవడంతో కొంత బాధగా ఉందన్నారు. ఎన్నో ప్రతిష్టాత్మకమైన రైళ్లు గూడూరు జంక్షన్‌లో నిలుపుతారని వారు గుర్తు చేశారు. గూడూరు నియోజకవర్గ ప్రజలు నిత్యం ఎంతోమంది వ్యాపార, వ్యక్తిగత పనుల నిమిత్తం గూడూరు కేంద్రంగా ప్రయాణిస్తుంటారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తోందన్నారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి, ఉన్నతాధికారులు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను గూడూరులో నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయండి

-వైసిపి పట్టణ కన్వీనర్ జి డిల్లిబాబు

వెంకటగిరి ఏప్రిల్ 23 ప్రభాతవార్త



మేనల 14 వతేది విశ్వహిందుపరిషత్ ఆధ్వర్యం లో జరిగే హనుమాన్ శోభాయాత్రను జయ ప్రదం చేయాలని పట్టణ వైసిపి అధ్యక్షులు జి డిల్లిబాబు తెలిపారు.దివారం నాడు హనుమాన్ శోభాయాత్ర గోడప త్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విశ్వోదయ కాలేజి మైదానం నుండి శివాలయం వరకు భైక్ ర్యాలి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమాన్ జయంతి వేడుకలను కూడ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజి ఎంసి చైర్మన్ పి రాజేశ్వరరావు,ఎపిపి ప్రకృతికుమార్, శ్రావణ్‌కుమార్,రవికుమార్ తదితరులు పాల్గోన్నారు.

## వాహనాల వేగానికి కళ్లెం వేసేదెలా..

**వేగం కన్న.. ప్రాణం మిన్న, నిర్లక్ష్యం పెనుప్రమాదం**

**కొంపముంచుతున్న రాంగ్ రూట్ ప్రయాణం**

**హెల్మెట్ ధరించడం తప్పనిసరి అంటున్న పోలీసులు**

గూడూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త

మద్యం సేవించి వాహనం నడపడం నేరం అని పోలీసులు ఎన్ని రకాలుగా హెచ్చరించినా కొంత మంది వాహనచోదకుల్లో మార్పు కనిపించడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. అధిక ప్రమాదాలు మితిమీరిన వేగం కారణంగానే జరుగుతున్నాయి. తిరుపతి జిల్లా గూడూరులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. నిత్యం వేలా సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ క్రమంలో అధిక వేగం, మద్యం సేవించి నడుపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టడానికి పోలీసులు అనేక రకాలుగా చర్యలు చేపట్టినా వాహనదారులు మారడం లేదు. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తూ పట్టుబడిన వారిని జైలుకు పంపిస్తూ జరిమానాలు విధిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. కొంత మంది కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణించే సమయంలోనూ మద్యం సేవిస్తున్నారని కుటుంబ సభ్యులు చెప్తున్నారు. వేగం కన్న ప్రాణం మిన్న అతివేగం ప్రాణానికి ప్రమాదకరం ఇలాంటి సూచనలు ఎన్ని పెట్టినా, పోలీసులు, రవాణా శాఖ ఎన్ని తనిఖీలు చేపట్టినా వాహనదారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు ముంచుకొస్తున్నాయి. ప్రమాదాల సంఖ్యను తగ్గించాలని చేస్తున్న పోలీసులకు సెల్‌ఫోన్ డ్రైవిగ్, రాంగ్ రూట్, నిర్లక్ష్య చోదనం తలనొప్పిగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ నిండు ప్రాణాలు కోల్పోయి కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు తీరని దు:ఖం మిగులుస్తున్నారు. ఇటీవల సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, నిర్లక్ష్య చోదనం, హెల్మెట్ లేకుండా వాహనాలపై దూసుకెళ్లడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న సంఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. సెల్‌ఫోన్‌లో మనసు పెట్టి వాహనాలు నడుపుతుండడంతో పక్కనా, ముందు ఎవరొస్తున్నారో గమనించే అప్రమత్తత తక్కువగా ఉంటుంది. చాలా మంది ఇయర్ ఫోన్లు పెట్టుకుని మాట్లాడుతుంటారు. మరొకొందరైతే ఫోన్ ఒక చేతిలో, స్టీరింగ్ లేదా హ్యాండిల్ మరో చేతితో పట్టుకుని డ్రైవింగ్ చేస్తుంటారు. దాదాపుగా 35 ఏళ్లలోపు వాహనదారులే ఇలా కనిపిస్తున్నారు.

## పురుగుల మందుతాగి యువకుడు మృతి

చిల్లకూరు ఏప్రిల్ 23 ప్రభాతవార్త

మండలంలోని తిమ్మన్నగారిపాళెంకి చెందిన ముస్లీం యువకుడు అయినటువంటి సలీం (27) అనే యువకుడు వివాహం కాలేదని గత కొద్ది రోజులుగా మనస్థాపానికిగురైఈనెల6వతేదిపురుగులమందు త్రాగి చికిత్స పొందు తున్నాడు.అయితే ఈనెల23వతేదితెల్లవారుజామున చికిత్స పొందుతు మృతి చెందాడు.తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చిల్లకూరు ఎస్ఐ బి గోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదు..

గూడూరు వన్‌టౌన్ సిఐ హజరత్ బాబు




డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేశాం. వాహనదారులకు అవగాహనతో పాటు మద్యం తాగి వాహనాలు నడుపొద్దని హెచ్చరిస్తూనే ఉన్నాం. డ్రంకెన్ డ్రైవ్ కేసుల విషయంలో కఠినంగా వ్యవహరించక తప్పదు. ఒక సారి రోడ్డు ప్రమాదం జరిగితే సదరు వ్యక్తితో పాటు, వ్యక్తి కుటుంబానికి, ఎదుటి వారికి తీవ్ర నష్టం జరుగుతుంది. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను సరిగ్గా పాటించాలి. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, నడపవద్దని సూచించారు.

## స్థలపతికి 'శైవాగమ మధుమణి'బిరుదు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయ స్థలపతి,స్థానిక మిరాశి వైదీకాగమ పీఠాధిపతి డాక్టర్ ఎస్ఎంకె స్వామినాధన్‌గురుకుల్ కి తిరుపతిలోని జాతీయ సంస్కృత కళాశాల ఆదివారం శైవాగమ మధుమణి బిరుదును'అందించారు.శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మిరాశిదారులుగా స్థానం ముత్తుకుమారస్వామి గురుకుల్ కుటుంబం ఆదినుంచి పర్యవేక్షిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామిమూలవిరాట్టును భరద్వాజ గోత్రీకులు మాత్రమే తాకి అభిషేకాలు నిర్వహించే ఆనవాయితి ఉంది. ఇక్కడి ఆలయంలో వేంకటేశ్వరగురుకుల్, సదాశివగురుకుల్, బాబూగురుకుల్ తరువాత వారసత్వాన్ని డాక్టర్ స్వామినాధన్ చేపట్టారు. ఇక్కడి ఆచారవ్యవహారాలపై పట్టుఉన్న స్థానం కుటుంబానికి చెందిన వారుగా స్వామినాధన్ గురుకుల్ అభిషేకాల గురుకుల్‌గా ఉంటున్నారు. స్వామినాధన్ గురుకుల్ శైవాగమంపై పరిశోధనలు జరిపారు.ఆయన అపారమైన శైవ ప్రజ్ఞను గుర్తించి పలువిశ్లేషణలు,పరిశీలనల అనంతరం తిరుపతిలోనిసంస్కృత కళాశాల వారు 'శైవాగమ మధుమణి' బిరుదును అందించారు.ఈమేరకు డాక్టర్‌స్వామినాధన్‌ను దుశ్శాలువతో సత్కరించారు. అవార్డును బహూకరించారు. ఆయనతోపాటు అచ్చితా గురుకుల్ ఉన్నారు.

## ఏలవేడులో వైకాపాలోకి 100 కుటుంబాలు చేరిక

శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం వేలవేడు గ్రామంలో ఆదివారం డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమ్మేళాన్ని ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి ముఖ్యఅతిదిగా పాల్గొన్న సమావేశంలో 350మంది తెలుగుదేశంపార్టీ నాయకులు,కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేసి వైకాపాలో చేరారు. వారిని ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం ఆహ్వానించగా శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్గనైజర్లు డాక్టర్ వెంకట్రాది, డాక్టర్ మణి, డాక్టర్ దాము, వెంకీ, ఎంపిటిసి భానుయాదవ్,, సర్పంచ్ బాలమ్మ, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వరయాదవ్‌లు పాల్గొన్నారు. కాగా వేలవేడు,మాదమాల గ్రామాల నుంచి ఆనంద్‌రెడ్డి,మునిరాజారెడ్డి, వెంకట్రామిరెడ్డిల సారధ్యంలో 350 కుటుంబాలు పార్టీలో చేరినట్లు ప్రకటించారు.

## మూటల మహాలక్ష్మమ్మ ఆలయ నూతన కార్యవర్గం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



మండలంలోని అక్కుర్తి గ్రామంలో వెలసిన నవఖండయోగిని అవధూత మూటల మహాలక్ష్మమ్మ దేవస్థానం ఆలయ పాలకమండలిని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ ఛైర్మన్‌గా పూజారి శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షులుగా తిరుకాల ఆనంద్‌గౌడ్, గౌరవాధ్యక్షులుగా జూలుగంటి గోపికృష్ణ, గౌరవ ఉపాధ్యక్షులుగా జూలుగంటి సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా బలరాంనాయుడు, గౌరవసలహాదారులుగా శంకర్‌రెడ్డి, భూపార్‌రెడ్డి, కార్యదర్శి బాష,అయ్యప్ప, ట్రెజరీ శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇక నుంచి ఆలయాన్ని అన్నివిధాల అభివృద్ధిచేసేలా చర్యలుతీసుకుంటామని నూతన కార్యవర్గం తెలిపింది.

## శ్రీరాంనగర్ కాలనీలో సమస్యల తిష్ట

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



నా నియోజకవర్గం అన్న కార్యక్రమంలో భాగంగా 45వ రోజున పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కోట వినుత పర్యటించి ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్‌ను ఆశీర్వదించాలని కోరారు. పట్టణంలో ఏమాత్రం అభివృద్ధి నాలుగేళ్ళలో ఏమాత్రం జరగలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ప్రచార ఆర్భాటాలు తప్ప అధికార పార్టీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. కనీససదుపాయాలు కూడా లేకపోవడం శోచనీయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు నితీష్‌కుమార్, బాలాజీ, చందుచౌదరీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ఆలయ చైర్మెన్‌కు ఘనస్వాగతం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 23 ప్రభాతవార్త



దక్షిణకైలాసంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మెన్ చక్రపాణిరెడ్డి దంపతులు విచ్చేసారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణగోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు.ఆలయంలో నిర్వహించిన గురుదక్షిణామూర్తి గురుసంక్రమణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అభిషేకాల అనంతరం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించారు.

## రాష్ట్రం అభివృద్ధి కావాలంటే టీడీపీని గెలిపించండి - గాలి భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరుకునే ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీని గెలిపించాలని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరి మున్సిపాలిటీ కీళపట్టులో వైసీపీ పాలనలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు తెలిపే కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలు ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కష్టాలు తెలుసుకున్నారు. తెలుగుదేశం హయాంలో మంజూరైన రోడ్లకు నేటి పాలకులు శిలాఫలకాలు వేసుకున్నారే తప్ప వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి జరగలేదన్నారు. వైసీపీ పాలనలో ప్రతి ఇంట్లో బాదుడే బాదుడు కనబడుతోంది. అన్నీ ధరలు పెరిగిపోయాయి, కరెంటు చార్జీలు, ఇంటి పన్నులు పెరిగిపోయాయని, ప్రజలపై వేల కోట్ల భారం, అప్పులు పెట్టారని విమర్శించారు. ప్రజల కష్టాలు తీరాలంటే టీడీపీని గెలిపించాలని గాలి భానుప్రకాష్ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా మధుసూదన్‌రెడ్డిని గెలిపించుకోవాలి

– ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

రేణిగుంట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:




రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని వారిని గెలిపించుకోవాల్సి న బాధ్యత తనతో పాటు కార్యకర్తలందరిపై ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తెలిపారు. రేణిగుంట మండలం సూరప్పకశం పంచాయతీ చెంగారెడ్డిపట్టెడ గ్రామంలో ఇటీవల మృతి చెందిన లక్ష్మీపతి కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం పరామర్శించి వారికి సిపాయి ఫౌండేషన్ ద్వారా ఒక సంవత్సరానికి సరిపడే 42 రేషన్ సరకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడం కోసం ఎన్ని ఆటంకాలు ఎదురైనా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధైర్యంగా ఎదుర్కొంటూ దూసుకుపోతున్నారన్నారు. అలాగే ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా పేద ప్రజలకు అండగా ఉన్నారని, వారిని గెలిపించుకోవాల్సి న బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలతో పాటు సర్పంచ్ సుధ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాన్ని మించిన స్నేహితుడు లేడు - ఓ.వి.రమణ

రేణిగుంట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



విజ్ఞానాన్ని పెంపొందించే మంచి పుస్తకాన్ని మించిన స్నేహితుడు ఈ సృష్టిలో లేడని విద్యా వికాస వేదిక కన్వీనర్ ఓ.వి.రమణ వ్యాఖ్యనించారు. రేణిగుంట పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు బీసీ హాస్టల్‌లో విద్యా వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నాటి పురాతన గ్రంథాల మొదలు నేటి పాశ్చాత్యాంశ పుస్తకాల వరకు అన్ని విజ్ఞాన భాండాగారాలుగా ఓ.వి.రమణ తెలిపారు. పుస్తక పఠనం వల్ల విద్యార్థుల్లో మేధాశక్తితో పాటు లోకజ్ఞానం పెరుగుతుందన్నారు. బూతు సాహిత్యానికి దూరంగా ఉంటూ జ్ఞాన సాహిత్యాన్ని చదవాలని పిలుపునిచ్చారు. ఎందరో శాస్త్రజ్ఞులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, చివరకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అంతర్జాల ప్రవీణులు కూడా పుస్తక పఠనం ద్వారానే ఆ స్థాయికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో కుప్పస్వామి, బాలికల పాఠశాల టీచర్లు ప్రతిమ, అనిత, పుష్పలత, బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ డిప్యూటీ స్పీకర్‌కు ఘన స్వాగతం

రేణిగుంట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



తెలంగాణ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, వైసీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. రేణిగుంట యువనేత ప్రభు తన మిత్ర బృందంతో విమానాశ్రయంలో ఘనంగా ఆహ్వానించి పూలబొకే ఇచ్చి శాలువతో సత్కరించి శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## ఆటలతోనే సంపూర్ణ ఆరోగ్యం - లక్ష్మీపతిరెడ్డి

రేణిగుంట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



గ్రామీణ పిల్లలకు ఆటల వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు దేహదారుఢ్యం పెరుగుతుం దని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి అన్నారు. విప్పమానుపట్టెడ గ్రామపంచాయతీ లో 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆదివారం వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా క్రికెట్ ఆటల పోటీలు నిర్వహించారు. వారికి క్రికెట్ ఆట వస్తువులను, బహుమతులు, ఇచ్చారు. ఆర్గనైజర్ సొసైటీ ప్రెసిడెంట్ లక్ష్మీపతిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ విధానంలో పిల్లలకు విద్యతో పాటు వ్యాయామం, ఆటలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే మేధస్సు పెరుగుతుందన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## గోశాల సంరక్షణకు రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న గోశాల సంరక్షణకు విజయవాడకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళం అందించారు. ఆదివారం విజయవాడకు చెందిన జి.సుజిని కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చారు. స్వామి అమ్మ వార్లను దర్శించు కున్న వారు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఏర్పాట్లు చేసిన ఆతిథ్యంతో సంతసించారు. ఆలయంలో నిర్వహిస్తున్న సేవలు పథకాలను వివరించారు. వారు లోబావిలో నిర్వహిస్తున్న గోశాలను పరిశీలించారు. వెంటనే వారు గోశాల పర్యవేక్షకు ఒకలక్షా నూట పదహారు రూపాయలను ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందించారు. వీరికి శేషవస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయానికి చెందిన సుదర్శన్ రెడ్డి, బాల, బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మునస్వామి యాదవ్ మృతదేహానికి టీడీపీ నాయకులు నివాళులు

కేవీబీ పురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, తెలుగుదేశం పార్టీ రైతు విభాగ అధ్యక్షుడు వెంకటరామయ్య యాదవ్ తండ్రి మునస్వామియాదవ్ మృతి చెందాడు. ఆయన మృతదేహానికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజలనాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు విభాగ ప్రధాన కార్యదర్శి, 5వ జోన్ క్లస్టర్ ఇన్‌చార్జి గోపినాథ్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, నాగరాజురెడ్డి, ఎస్.ఎల్.పురం వెంకటేష్, చెంగ్రాయులు, మునికృష్ణయ్య, వెంకటేష్ యాదవ్‌లు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## బటన్ నొక్కినా.. అదే నిరీక్షణ

కోట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త

నవరత్నాలు అమలులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా అమలు కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో ఏలూరు జిల్లా దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 25న ప్రారంభించారు. డిఆర్‌డిఎ, ఐకెపి ఆధ్వర్యంలో ఆ తర్వాత నుంచి ఈ నెల 5వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రతిరోజు ఏదో ఒక మండల కేంద్రాల్లో ఆసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని నమూనా చెక్కులు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నెలరోజులు కావస్తున్నా ఆసరా మూడో విడత రుణమాఫీ సొమ్ము జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాలకు ఇంకా పూర్తిస్థాయిలో జమ కాలేదు. దీంతో పలువురు ఆశగా ఎదురు చూస్తున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు 2019 ఏప్రిల్ నాటికి తీసుకున్న బకాయిలు ఉన్న బ్యాంకు లింకేజి రుణాలను వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తామనం ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా గత నెలలో మూడో విడత అమలుకు శ్రీకారంచుట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి బ్యాంకు లింకేజి ద్వారా తీసుకున్న రుణం మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నాలుగు విడతల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు సగం సంఘాలకు కూడా బ్యాంకుల్లో జమ కాలేదని మహిళలు ఆరోపిస్తున్నారు. డిబిటి విధానంలో నేరుగా బ్యాంకుకు జమ కానున్న నేపథ్యంలో ఇప్పటివరకు ఎన్ని సంఘాలకు ఎంత మొత్తం నగదు జమ చేశారన్న సమగ్ర వివరాలు అధికారుల వద్ద కూడా లేకపోవడం గమనార్హం. కొందరికి జమ అయినట్లు తెలుసుకుంటున్న మహిళలు మాకెప్పుడు జమ అవుతాయంటూ క్షేత్రస్థాయిలో సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు.

## వారపు సంతలో పేదలకు ఉచిత భోజనం

నభూతో నభవిష్యతీ.. చెవిరెడ్డికి సాటిలేరు.!

ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



వారపు సంతలో పేదలకు ఉచిత భోజనం పంపిణీ చేయడం కొనసాగుతుందని ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆదివారం పేదలకు ఆయన ఉచిత భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నభూతో నభవిష్యతీ అంటూ మా నాయకుడు ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి సాటిలేరని కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గ ఆవిర్భావం నుండి ఏ ప్రజా ప్రతినిధి అందించని ప్రజాహిత సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్న ఘనత ఒక్క చెవిరెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క ఎంఎల్ఏ సైతం చేపట్టని ప్రజా ప్రయోజిత కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనుడు మా ఎంఎల్ఏ అన్నారు. 2024 ఎన్నికలలో చెవిరెడ్డి వారసుడుగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎంఎల్ఏగా భారీ మెజారిటీతో గెలిపించుకోవడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, సర్పంచ్‌లు ముద్దికుప్పం రూపరామమూర్తి, కొటాల చంద్రశేఖర్ రెడ్డి, అగరాల భాస్కర్ రెడ్డి, వెంకటయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బందారు హేమచంద్రారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మస్తాన్, చంద్రగిరి డివిజన్ కన్వీనర్ కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, తొండవాడ డివిజన్ కన్వీనర్ పసల నాగరాజు, వైసిపి కార్మిక విభాగం మండల అధ్యక్షుడు సంధిపుట్టి బాలకృష్ణ, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు సూరి, తదితరులు పాల్గొన్నారు.

## ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులకు పులివర్తి నాని పరామర్శ

చంద్రగిరి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



మండల పరిధిలోని పిచ్చినాయుడుపల్లికి చెందిన ఎస్.ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులను టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని ఆదివారం పరామర్శించారు. టిడిపికి చెందిన ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందినట్లు సమాచారం అందుకున్న ఆయన ఇక్కడికి చేరుకుని మృతిరాలి భౌతికకాయంపై పూలమావేసి నివాళులర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, శానంబట్ల తులసి రెడ్డి, హరి, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

## వైభవంగా శ్రీ ముత్యాలమ్మ జయంతి ఉత్సవాలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



రాయలచెరువు పేటలో వెలసియున్న శ్రీముత్యాలమ్మ అమ్మవారి జయంతి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో హోమాలతో కూడిన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో పెద్ద ముత్యాలమ్మ అమ్మవారి నూతన విగ్రహానికి ప్రధాన అర్చకులు రాజగోపాల్ అయ్యంగార్ శిష్య బృందంచే ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వైసిపి కబ్జా కోరల్లో చిక్కుకున్న రాష్ట్రం

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి .. పులివర్తి సుధారెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైసిపి కబ్జా కోరల్లో చిక్కుకుని విలవిల లాడుతున్నట్లు టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి దుయ్య బట్టారు. ఆదివారం పి.వి.పురం పంచాయతీలో నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డికి టిడిపి గ్రామకమిటీ అధ్యక్షుడు మల్‌రెడ్డి, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు త్యాగరాజులు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె గడప గడపకు తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని రెండు పర్యాయాలు గెలిపించినా అభివృద్ధిలో ఫలితం శూన్యమన్నారు. 2024లో ఎన్నికలలో టిడిపి అభ్యర్థి పులివర్తి నానిని ఎంఎల్ఏగా గెలిపించాలని కోరారు. రాష్ట్రం అన్ని రంగాలలో కుదేలైనందున తిరిగి అభివృద్ధి వైపు పయనించాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, ఉమాపతి నాయుడు, కోరా హరిప్రసాద్, పసుపులేటి విజయ్‌కుమార్, బాదూరు నరశింహారెడ్డి, ఢిల్లీనాధ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌తో ప్రజకు తప్పని కష్టాలు

టిడిపి జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్

నారాయణవనం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



మండలంలోని బొబ్బరాజుపాలెం పంచాయతీలో ఆదివారం తెలుగుదేశ ం పార్టీ ఆధ్వర్యంలో ఇదేమీ కర్మ ఈ రాష్టానికి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుపతి జిల్లా టిడిపి అధ్యక్షులు నరసింహయాదవ్, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, సత్యవేడు నియోజకవర్గ ఇంచార్జీ హెచ్ హెలెన్ హేమలతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ సిఎంగా వున్నంత కాలం ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. ప్రజలపై అన్ని రకాల వస్తువులపై పెంచిన ధరలతో తల్లడిల్లుపోతున్నట్టు గుర్తు చేశారు. ఎప్పుడు ఎన్నికలు ఇచ్చిన టిడిపికి పట్టం కట్టడానికి ప్రజలు సిద్దంగా వున్నారన్నారు. అనంతరం దిగువబొబ్బరాజుపాలెం, లక్ష్మీపురంయానాధికాలనీ, ఎగువ బొబ్బరాజుపాలెంలో ఈ కార్యక్రమం జరిగింది. మండల క్లస్టర్ ఇంచార్జీ పి గిరిబాబు, జిల్లా నాయకులు టి.షణ్ముగం, కె వాసుదేవన్, కిరణ్, రమేష్, కందస్వామినాయుడు, కృష్ణారెడ్డి, లత, పురుషోత్తం, పొన్నుస్వామి యాదవ్, లక్ష్మన్, లత, ఎస్ఎన్ కందస్వామిమొదలి, లోకయ్య, మునిబాబు, ఆరుముగం, కోదండం, ప్రేమ్ కుమార్, శాంతి, చంద్రశేఖర్‌నాయుడు, దిల్లీబాబు, సొరకాయులు, ఎన్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి సముదాయం అగస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆరంభం

నారాయణవనం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు నేడు సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఉత్సవాల్లో మొదటి రోజు సోమవారం సాయంత్రం 6గంటల నుంచి గణపతిపూజ, రాత్రి 8గంటలకు అంకురార్పణ నిర్వహించడం జరుగుతుందని ఆలయ పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో చలువపందేళ్లు, విద్యుత్‌దీపాలంకరణ, ఆర్చీలు, పచ్చని అరటి, మామిడి ఆకులను కట్టారు. శుక్రవారం ఉదయం 9-10.30 గంటలకు (మిథునలగ్నం)లో ధ్వజారోహణం జరుగనుంది.

## ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కార్యదర్శిగా బొప్పన శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతి జిల్లా నూతన జిల్లా కార్యదర్శిగా బొప్పన శ్రీనివాసులను నియమించారు. తిరుపతిలో నిర్వహించిన తిరుపతి జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా కో కన్వీనర్ బాధ్యతలు నిబద్ధతతో ఒక సంవత్సరం పాటు నిర్వహించారు. ఈ తరుణంలో జిల్లా వ్యాప్తంగా మండల స్థాయి నుండి పార్టీని గ్రామ స్థాయికి బూత్ స్థాయికి తీసుకెళ్లడం కోసం రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఆర్. మణి నాయుడు చేతులు మీదుగా జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్ ఆదేశాలతో జిల్లా కౌన్సిల్ తీర్మానం చేసి నియమించారు.

## వైభవంగా గురు సంక్రమణ పూజలు

నగరి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని దక్షిణామూర్తి ఆలయాల్లో ఆదివారం గురు సంక్రమణ పూజలు వైభవంగా జరిగాయి. గరు భగవానుడు మీన రాశి నుంచి మేష రాశికి ప్రవేశించు సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంతేశ్వర ఆలయంలో ఉదయం 9.30 గంటల నుంచి 12 వరకు మూల స్థాన శ్రీమేతా దక్షిణామూర్తి స్వాముల వారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మండపం వద్ద ఉత్సవ దక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేకాలు చేసి అలంకరించారు. మేషం, కుంభం, మకరం, వృశ్చికం, కన్య, కర్కాటకం, వృషభ రాశుల వారు పరిహారం చేసుకోగా మీనం, ధనస్సు, తుల, సింహం, మిధున రాశుల వారు పూజల్లో పాల్గొని గురు భగవానున్ని దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సత్రవాడ ఈశ్వరాలయంలోని దక్షిణామూర్తి సన్నిధిలోని ప్రత్యేక అభిషేక , అర్చనలు చేసి స్వామిని సుందరంగా అలంకరించగా భక్తులు దర్శించుకుని పరిహార పూజలు చేసుకున్నారు.

## ఎంఎల్‌ఏను సత్కరించిన మధురెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్‌కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన జ్ఞానాంబవారిదాసు(మధురెడ్డి) ఆదివారం స్థానిక శాసనసభ్యులు బియ్యపు మధుసూధన్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించారు. తనకు మార్కెట్‌కమిటీ పదవిని అప్పగించినందుకు ఎంఎల్‌ఏకు ధన్యవాదాలు తెలిపారు. ఎంతో నమ్మకంతో తనకు పదవి అప్పగించినందుకు తన వంతు కృషిచేస్తానన్నారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా ఘంటసాల 49వ వర్ధంతి

తిరుచానూరు,ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



ఆదివారం గాన గంధర్వుడు స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుచానూరులోని ఆయన విగ్రహానికి స్థానికులు, రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో పూలమాల వేసి, పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఘంటసాల అద్భుతమైన ఆణిముత్యాల్లాంటి సినిమా పాటలు, అలాగే భగవద్గీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని కీర్తించారు. ఈ కార్యక్రమంలో డా॥హనుమంతరావు, వెంకటేష్, మునిరామిరెడ్డి, పెంచల్ నరసయ్య, గోకుల్, మురారి, తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ సభ్యులకు ఉచిత దంత వైద్య శిబిరం

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

ఆదివారం స్థానిక ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో కాకర్ల డెంటల్ హాస్పిటల్ అధినేత డా॥సుబ్బరాజు సహకారంతో, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 302 గవర్నర్ రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాకర్స్ సభ్యులకు ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రాఫిక్ డిఎస్పీ కాటమరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్టు బోర్డు సభ్యుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, సామాజిక వైద్యశాస్త్ర నిపుణుడు డా॥రెడ్డెప్పలు హాజరయ్యి దంత వైద్య శిభిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా 150 మంది వాకర్స్ సభ్యులకు దంత వైద్య పరీక్షలు, అలాగే కంటి పరీక్షలు, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎమ్మార్వో లక్ష్మీ నరసయ్య, వాకర్స్ సభ్యుడు చిట్టిబాబు, మోహన్ డయాబెటిక్ ఆసుపత్రి అధినేత డా॥మోహన్, హారిక కంటి ఆసుపత్రి అధినేత్రి డా॥హారిక, ఈఎస్ఐ ఆసుపత్రి నుండి డా॥చందన, వాకర్స్ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, బండి మధుసూధన్‌రెడ్డి, ఆర్ముగం, గోపి యాదవ్, జి.సుబ్రహ్మణ్యంరెడ్డి, పెద్ద సంఖ్యలో వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## 4,5 తేదీలలో తిరువణ్ణామలైకి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

-జిల్లా ప్రజా రవాణా అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి వెల్లడి

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

మే 4వ తేదీ గురువారం పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ కోసం వేలాది మంది ప్రజలు మన జిల్లా నుండి తరలి వెళతారు. వీరి సౌకర్యార్థం జిల్లాలోని అన్ని డిపోల నుండి ఏపిఎస్ఆర్టీసీ 62 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసిందని జిల్లా ప్రజా రవాణా అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ డిపోలకు చెందిన బస్సులు తిరుపతి సెంట్రల్ బస్ స్టేషన్, వెంకటగిరి, వాకాడు, సూళ్లూరుపేట, సత్యవేడు, పుత్తూరు బస్సులు 4వ తేదీ ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు, అలాగే 5వ తేదీ ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు తిరువణ్ణామలై వెళ్లడానికి, అదేవిధంగా అక్కడి నుండి తిరుపతి, వివిధ ప్రాంతాలకు తిరిగి రావడానికి అందుబాటులో ఉంటాయన్నారు. ఇందులో 4వ తేదీ అమరావతి ఏసి బస్సులు 2, ఎక్స్‌ప్రెస్ 19, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ 10, అదేవిధంగా 5వ తేదీ అమరావతి ఏసి బస్సులు 2, ఇంద్ర ఏసి 3, సూపర్ లగ్జరీ 2, అల్ట్రా డీలక్స్ 1, ఎక్స్‌ప్రెస్ బస్సులు 9, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ 5 తో కలిపి 62 బస్సులను ఆ రెండు రోజులకు సిద్ధంగా ఉంచామని ఆయన వివరించారు. సూచనలు, సలహాల కోసం 9959225684/ 9959225686 నెంబర్లకు కాల్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని ఆయన అన్నారు.

## ధ్యానం - పౌష్టికాహారం, శారీరిక వ్యాయామం

చక్కని జీవన విధానం అద్భుత ఔషదం

తిరుపతి (విద్య), ఏప్రిల్ 23, ప్రభాతవార్త




శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, జాతీయ సేవా పథకం యూనిట్ 3 దత్తత గ్రామమైన తనపల్లిలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవ శిభిరంలో భాగంగా తనపల్లి హరిజనవాడలో ఆదివారం చంద్రగిరిలోని భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలోని ఆరోగ్య పరిశోధన విభాగానికి చెందిన ఆదర్శ గ్రామీణ ఆరోగ్య పరిశోధన విభాగం, ఆంధ్ర ప్రదేశ్ యొక్క శాస్త్రవేత్త డా. ప్రసాద్ రీసోర్స్ పర్సన్‌గా విచ్చేసి అంటువ్యాధులు, అంటువ్యాధులు కాని వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధునిక కాలంలో బీపీ, షుగర్, గుండె సమస్యలు వంటి అనేక రకాల జబ్బులకు కారణం కేవలం మానసిక ఒత్తిడి, జీవన శైలి మార్పులు, తప్పుడు ఆహారపు అలవాట్లు అని, మన అసహజ ప్రవర్తన వల్ల సంక్రమించే ఈ వ్యాధుల భారిన పడుతామని అన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల మధ్యలో కనీసం 7.20 నిమిషాలు అయినా శరీరానికి సూర్యరశ్మి తగిలేలా ఉండమని సూచించారు. వ్యక్తి యొక్క గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు లేదా ఊపిరితిత్తుల శ్వాస ఆగినప్పుడు ఉన్నప్పుడు వెంటనే ఆ చర్యల పునరుద్దరణకు చేసే అత్యవసర ప్రక్రియను సిపిఆర్ అంటారని వివరించి దాన్ని చేసే విధానాన్ని ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. నీరజ, గ్రామస్తులు, సచివాలయం వాలంటీర్ లావణ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## డయల్ యువర్ కమిషనర్, స్పందనను సద్వినియోగం చేసుకోండి

కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం 24వ తేది ఉదయం 10 నుండి 11 వరకు డయల్‌యువర్ కమిషనర్ కార్యక్రమం, 11 నుండి 12 గంటల వరకు నేరుగా అర్జిలు, పిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. 0877-2227208 నంబర్‌కి కాల్ చేసి తమ ఫిర్యాదులు తెలియజేయవచ్చు అని నేరుగా వచ్చి అర్జిలు, ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు.

## సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

-కార్మికుల మెరుపు ధర్నాలో సిఐటియు డిమాండ్

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టిటిడి అధికారులను టిటిడి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.సుబ్రహ్మణ్యం, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు జి.బాలసుబ్రహ్మణ్యం, పి.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమల బైపాస్ రోడ్డు నందు సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు మెరుపు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న యూనియన్ నాయకులు మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాల పైబడి సులభ్ కార్మికులు శ్రీవారికి సేవ చేస్తున్నారని, వారికిచ్చే అరకొర జీతాల్లో సైతం కోతలు విధించడం అన్యాయమన్నారు. సులభ్ సంస్థను రద్దు చేసి శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్‌లో కార్మికులను కలపాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు టైంస్కేల్ అమలు చేయాలని కోరారు. గతంలో ఎఫ్ఎంఎస్ కార్మికులు టిటిడి పరిపాలనా భవనం వద్ద 14 రోజుల పాటు ఆందోళన చేపట్టిన క్రమంలో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి, ఇంతవరకు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా టిటిడి యాజమాన్యం పంతానికి పోకుండా సులభ్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సులభ్ కార్మికులు చిరంజీవి, రాజా, ధనంజయ, రాజేంద్ర, నోమేష్, ధనలక్ష్మి, మునిలక్ష్మి, రేణుక, సిఐటియునాయకులు జయచంద్ర, పారథసారథి, సాయిలక్ష్మి, జయంతి, తదితరులు పాల్గొన్నారు.

## పేదవారి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్ పునరుద్ధరిస్తాం..!

టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు

చంద్రగిరి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



ఏడాది పొడవునా పేదవారి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్‌లను టిడిపి అధికారం చేపట్టిన వెంటే పునరుద్ధరిస్తామని టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు అన్నారు. గత ఆదివారం వారపు సంతను పురస్కరించుకుని పేదవారికి అన్నా క్యాంటీన్ తరహా భోజనాన్ని ఉచితంగా పంపిణీ చేసిన టిడిపి నాయకురాలు సుధారెడ్డి ప్రతి ఆదివారం కొనసాగిస్తామన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్సీకాంప్లెక్స్ వద్ద ఆదివారం ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అన్నా క్యాంటీన్లను నిర్దాక్షిణ్యంగా మూసివేసిందన్నారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తెలుగు మహిళ విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు లంకెళ్ళ లలిత, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, నాయకులు ఏజి పల్లి బాల, శానంబట్ల తులసి రెడ్డి, మండలం లోకేష్, అమ్ములు, కన్నయ్య నాయుడు, నాయుడమ్మ, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఎం కొత్తూరులో మాతమ్మ తిరుణాళ్ళ

నగరి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



నగరి రూరల్ మండలం ఎం కొత్తూరు ఏఏడబ్ల్యు శ్రీశ్రీశ్రీ మాతమ్మ తిరుణాళ్ళ సందర్భంగా అగ్నిగుండ ప్రవేశంలో నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

# మే 14 నుంచి వైయస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్

-రూ.25లక్షల వ్యయంతో క్రికెట్ టోర్ని
-పాల్గొన్న ప్రతి క్రికెట్ టీమ్‌కు క్రికెట్ కిట్ ఉచితం
-వైకాపా చంద్రగిరి అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



తిరుపతిరూరల్, ఏప్రిల్23 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గంలో యువ క్రీడాకారులను ప్రోత్సహిం చుటకు మే 14న వైయస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థి, తిరుపతిరూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మోహిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్.రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా పంచాయతీల నుండి ఎన్ని క్రికెట్ టీమ్‌లైన పాల్గొనవచ్చునని తెలిపారు. 17 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ క్రికెట్ పోటీలలో పాల్గొనవచ్చునని, ఆధార్ గుర్తింపుతో పాటు వయస్సు ధృవీకరణ సర్టిఫికేట్స్ అందజేయాలన్నారు.

**రేపట్నించి నుంచి ఎమ్మెల్యే కార్యాలయాల వద్ద ధరఖాస్తులు స్వీకరణ**

వైయస్సార్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనదలిచిన క్రీడాకారులు 11 మంది ఒక టీమ్‌గా ఏర్పాటై ఏప్రిల్ 25 నుండి నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యే కార్యాలయాల్లో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక క్రీడాకారుడికి టీషర్ట్‌తో పాటు ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడునని తెలిపారు. వైయస్సార్ క్రికెట్ టోర్నిని రూ.25లక్షల వ్యయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో విజేతలకు మొదటి బహుమతి రూ.1లక్ష, రెండో బహుమతి రూ.50వేలు, మూడోవ బహుమతి రూ.25వేలు, నాలుగో బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపాం. నియోజక వర్గంలో ప్రతిభకనబరిచినవారికి మొదటి బహుమతి రూ.5లక్షలు, రెండో బహుమతి రూ.3లక్షలు, మూడో బహుమతి రూ.2లక్షలు, నాలుగో బహుమతి రూ.1లక్ష నగదు ఇవ్వనున్నట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రతి మ్యాచ్‌కు బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మెమెంటోలను ఇవ్వబడునని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌కు సుమారు 500 నుంచి 750 టీమ్‌లు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. టోర్నిలో పాల్గొనే క్రీడాకారులకు ఉచితంగా అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, ఇవ్వనున్నట్లు తెలిపారు.

## షార్ శాస్త్రవేత్త గోపీకృష్ణకు ఉగాది పురస్కారం



అవార్డుకు ఎంపికైన షార్ శాస్త్రవేత్త గోపీకృష్ణ

శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 23 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వ తెలుగు సంస్కృత అకాడమి ప్రకటించిన ఉగాది పురస్కారాలలో షార్ శాస్త్రవేత్త గోపీకృష్ణ ఎంపికయ్యారు. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల కేటగిరికి సంబంధించి ఆయన్ను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. శ్రీహరికోట లోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో ఎంఎస్ఎ గ్రూప్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పి.గోపీకృష్ణకు రాష్ట్రప్రభుత్వం ఉగాది పురస్కారం లభించింది. మంగళవారం గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ఆయన అందుకోనున్నారు. ఇస్రోలో వివిధ విభాగాలలో పనిచేసి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందిన గోపీకృష్ణ ఇటీవల ఎంఎస్ఎ గ్రూప్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన శ్రీహరికోటలో జరిగే రాకెట్ ప్రయోగాలు, వివిధ కార్యక్రమాలకు సంబంధించి మీడియా సమన్వయకర్తగా ఉన్నారు. ఇస్రో ఛైర్మన్ల హోదాలో సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయానికి వస్తున్న వారి వెంట ఎప్పుడూ గోపీకృష్ణ ఉంటూ ఆ కార్యక్రమాలను కూడా పర్యవేక్షిస్తూ స్థానికులతోనూ సత్సంబంధాలు కలిగి ఉన్నారు. గోపీకృష్ణ ఈ పురస్కారం ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

మనోవికాస్ ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో...

## "వార్త" ఈడి గౌరవసంఘీ జన్మదిన వేడుకలు



తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్త: ప్రజాసమస్యల పరిష్కారానికి వార్తల రూపంలో పోరాటం సాగిస్తూ అధికారులకు,ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉన్న "వార్త"జాతీయ తెలుగుదినపత్రిక సేవలు అనిర్వచనీయమని పాస్ మనోవికాస ప్రత్యేక ఆశ్రమపాఠశాల ప్రిన్సిపాల్ పివిఎన్ మురళీకృష్ణ అన్నారు. సేవా భావంతో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న వార్త యాజమాన్యం, సిబ్బంది సేవలు ఈ సందర్భంగా ఆయన వివరించారు. "వార్త"ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవసంఘీ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం పద్మావతిపురంలోని మనోవికాస్ పాఠశాలలో మానసిక దివ్యాంగ విద్యార్థులకు తిరుపతి యూనిట్ మేనేజర్ పుణ్యమూర్తి,సిబ్బంది పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

# వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చడానికి సహకరించాలి

-రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాలి- జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం నేతలు విజ్ఞప్తి




-సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర్ల సంఘ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : వడ్డెర్లను ఎస్టీజాబితాలో చేర్చడానికి అందరు సహకరించాలని పలువురు వడ్డెరసంఘ నేతలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని గోపాలవనంలో ఉన్న విశ్వభారతీ పాఠశాలలో తిరుపతి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలువురు వడ్డెర సంఘ నేతలు మాట్లాడుతూ తమకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీకే మద్దతు ఇస్తామని సంఘనేతలు ప్రకటించారు.తిరుపతి జిల్లా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కమిటీ సభ్యులు ఈ సమావేశానికి హాజరైయ్యారు. తరతరాలుగా సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ రంగాల్లో వెనుకబడిన వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చడానికి అన్ని రాజకీయ పార్టీల నేతలు సహరించాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలో 40లక్షల మందికి పైగా వడ్డెర్లు ఉన్నారని పాలకుల నిర్లక్ష్యం కారణంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెర్ల అభివృద్ధి చెందాలంటే చట్టసభల్లో అవకాశం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న జనాభా దామాషా ప్రకారం వడ్డెర్లకు ఐదు ఎంఎల్ఏలు, రెండు ఎంపి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నామినేటేడ్ పదవుల్లో వడ్డెర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ కుల సంఘం నేతలకు పదవులు వచ్చేలా చేయాలన్నారు. మండల స్థాయిలో కమిటీలు బలోపేతం చేయాలని తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర వడ్డెర్ల జెఏసి ఛైర్మన్ వేముల సుబ్బా రావు, వైస్ ఛైర్మన్ గుంజి శ్రీనివాస రావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు తురక అమరనాథ్, ప్రధాన కార్యదర్శి కోనంగిశ్రీరాములు, వర్కింగ్ అధ్యక్షుడు మల్లి శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శి దేరంగుల శ్రీధర్, ఉపాధ్యక్షులు వలిపిశ్రీరాములు, సంఘనేతలు విజయకుమార్, తేపల్లె విజయ్‌శ్రీనివాస్, జెరిపిటిజయరాం, గుంజిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అత్తిమంజేరి గ్రామంలో దుర్యోధనుడి వధ



పాలసముద్రం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం అత్తిమంజేరి గ్రామంలో జరుగు తున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దురోధ్యనుడి వధ జరిగింది. దురోధ్య నుడి వధ కార్యక్రమంలో దుర్యోధనుడిగా కలకడ శివ, భీముడిగా రవి, ద్రౌపతిగా గుణ వేషాధారణ అంద రిని రక్తికట్టించింది. దుర్యోధనుడి వధ అనంతరం ధర్మరాజులు పట్టాభిషేక ఉత్సవానికి ఉభయదారు లుగా కృష్ణంరాజు విజయరాజు కుటుంబ సభ్యులు వవహరించారు. అలాగే ధర్మరాజుల గుడి ఆవరణలో అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. మరోవైపు వీధి నాటకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త వెంకటరామరాజు, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

## పరాశారేశ్వరుని సేవలో గురుపయర్చి పూజలు



నారాయణవనం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశారేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 9గంటలకు గురుసంక్రమణ పూజలను నిర్వహించారు. ముందుగా గణనాధునికి పూజలు చేసిన తర్వాత గురు దక్షణమూర్తికి అభిషేకం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారిని పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరిబొండ, తేనే, చందనం, విభూది వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం పుష్పాలతో అలంకరించిన భక్తులకు దర్శనం కల్పించారు. మేష, కన్య, కుంభం, వృశ్చికరాసుల వారు పరిహారం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారి రమణిస్వామి, శరవణ, భక్తులు పాల్గొన్నారు.

## పుష్పగిరి మఠంలో గురుసంక్రమణ హోమాలు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో నిత్యం ధార్మిక కార్యక్రమాలతో విరాలజిల్లు తుంది. ఈ నేపధ్యంలో సామాజిక సంక్షేమానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తిలోని తేరువీధిలో వెలసిన పుష్పగిరి మఠంలో ఆదివారం జయనిధి సేవా సంఘం సారధ్యంలో గురు సంక్రమణ హోమాలు నిర్వహించారు. వరదగురుకుల్ సారధ్యంలో కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహించారు. నవగ్రహాల్లో పంచమగ్రహమైన గురు గ్రహం మీనరాశి నుంచి మేషరాశిలోకి ప్రవేశించిన సందర్భంగా పూజలు హోమాలు ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా గురుకుల్ వివరిస్తూ నేడు గురుగ్రహ సంక్రమణ పూజలు హోమాలు నిర్వహించామన్నారు. ఆ తరువాత శతృబాధనివారణకు, రుణ విమోచనకు కాలభైరవ హోమం నిర్వహించినట్లు తెలిపారు. గురుదక్షిణామూర్తి చిత్రపటానికి పాలు,పెరుగు,గంధం, కుంకుమ, సికాయ,పంచామృతం వివిధ రకాలు అభిషేకాలు నిర్వహించినట్లు వివరించారు. తరువాత స్వామి వారికి వివిధ పుష్పాలతో అలంకరణ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పంచహారతులు అందించారు.ఈ ఉత్సవంలో పాల్గొన్న విశేష భక్త జనానికి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీజయనిధి సేవా సంఘం సభ్యులు వరదరాజగురుకుల్, నీలకంతం స్వామి, కమల్‌స్వామి,మురళీధర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

**ఎంఎల్ఏకు స్వాగతం:**

పట్టణంలోని పుష్పగిరిమఠంలో ఆదివారం శ్రీజయనిధి సేవాసంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు స్థానిక శాసనసభ్యుడు బియ్యపుమదుసూధనరెడ్డి కి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కలశానికి దర్శనం చేసుకున్నారు.ఈకార్యక్రమాల్లో ఎంఎల్ఏ తోపాటు పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు వారి సహచరులు పాల్గొన్నారు.పూజల్లో హోమాల్లో ఎంఎల్ఏ పాల్గొన్నారు.

## సత్యవేడులో మంత్రి పెద్దిరెడ్డి విస్తృత పర్యటన




నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం ఏప్రిల్ 23 ప్రభాతవార్త : ఆదివారం రాష్ట్ర భూగర్భ గనులు శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూడు మండలాల్లో పలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నారాయణవనం బైపాస్‌లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద మంత్రికి స్వాగతం పలికిన తర్వాత దుశ్శాలువ, పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం పిచ్చాటూరులోని టీచర్స్ కాలనీలో కొత్తగా వెలసిన నాగాలమ్మ ఆలయ మహా కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడ ఆయనికి పూర్ణకుంభంతో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వాదించారు. అనంతరం నాగలాపురం మండలంలోని సురుటుపల్లి ఆలయంలో జరిగిన గురు దక్షణమూర్తికి జరిగిన గురు సంక్రమణ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి దంపతులతో పాటు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు పి సుదర్శన్‌రెడ్డి, బీరేంద్రవర్మ, పి దివాకర్‌రెడ్డి, ఎంవిఎం బాలాజీరెడ్డి, హరిచంద్రారెడ్డి, అపరంజిరాజు, మోహణ , తొప్పయ్య, చిన్నదొరై, ఊరప్ప, సోదామణిరెడ్డి, శరవణరెడ్డి, గురుస్వామి, సాయిరవి, బత్తలభాస్కర్‌బాబు, ఇ సుబ్రమణ్యంరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో తిరుపతి జిల్లా కలెక్టర్



కాణిపాకం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి కుటుంబసమేతంగా ఆదివారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఏఈఓ కృష్ణారెడ్డి, సూపరెంటెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన కాణిపాకం ఆలయం



కాణిపాకం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. శని,ఆదివారాలు ప్రభుత్వ సెలవురోజులు కావడంతో కాణిపాకం స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే తీర్థజనం కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు మూడు నాలుగు గంటలకు పైగా స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే భక్తులు వచ్చిన వివిధ రకాల వాహనాలతో కాణిపాకం పరిసరాలు, వాహన పార్కింగ్‌లు పూర్తిగా నిండిపోయాయి. రద్దీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

## ముదిమి వయసులో వికసించిన " మైత్రీ " బంధం

-56యేళ్ళ తర్వాత కలసిన మిత్రబృందం



చౌడేపల్లి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మనువళ్ళు ముదిమనవరాళ్ళతో సమయం గడిపే వయస్సు...అవ్వా తాతలయినా ము ఖాల్లో చెరగని చిరునవ్వు...ఏడు పదులు దాటిన బాల్య మిత్రులందరూ జట్టుకట్టిన వైనం... అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొంటూ పగలంతా హాయిగా కడిపిన పెద్దోళ్ళు...మండలానికి చెందిన 1967-72మధ్య చౌడేపల్లిలో ఎస్ఎస్ఎల్‌సి చదివిన పూర్వపు విద్యార్థుల(పెద్దల)కలయికకు స్థానిక బైసాని కళ్యాణ మండపం వేదికైంది. సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ విప్లవం లేని అలనాటి సమాజంలో విద్యనభ్యసించిన వారందరూ కలుసుకొనేందుకు 2యేళ్ళపాటు శ్రమించి దాదాపు 35మంది పూర్వపు విద్యార్థులందరూ ఒకచోట కలుసుకొన్నారు. ప్రముఖ పారిశ్రామిక, విద్యా, రాజకీయవేత్తలను సమాజానికందించి, మేధావి వర్గానికి చెందిన పెద్దలందరూ వయసు మరచి చిన్నపిల్లల చేష్టలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకొంటూ ముచ్చటించుకొన్నారు. చిననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొంటూ పగలంతా గడిపారు. విద్యనభ్యసించాలన్న తపన వుండి ఆర్థికంగా వెనుకబడిన వారికి తమవంతు సాయమందించాలని పెద్దలందరూ నిశ్చయించుకొన్నారు. ఇంతమంది కలయికకు కారకులైన బైసాని కృష్ణమూర్తి, చంద్రగిరి వెంకటసిద్ధులను వారందరూ అభినందించారు. 1967-72 మధ్యగల పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిచే గ్రంథావిష్కరణ



తిరుపతి (క్రీడా), ఏప్రిల్ 23 ప్రభాతవార్త : ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి జీవితం రచనలు అనే గ్రంథాన్ని మంత్రి డా॥పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని విక్రమ సింహపురి యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి రచించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో జీవిత చరిత్రలు వెలుగులోనికి రావా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేట శ్రీ ముప్పై ఏళ్ళ పాటు అధ్యాపకుడిగా ఎస్వీ యూనివర్సిటీకి ఎంతో సేవ చేశారన్నారు. ఎస్వీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. రాజా రెడ్డి మాట్లాడుతూ పేట శ్రీ తిరుపతికి సంబంధించిన అనేక గ్రంథాలను రచించి ప్రసిద్ధి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా సీనియర్ జర్నలిస్టు మీసరగండ పాండురంగరాజు, స్వుటా మాజీ అధ్యక్షులు ఆచార్య పుట్టా మునిరత్నం రెడ్డి, తెలుగు అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, డా. మళ్ళా పెంచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై "రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు"

చంద్రగిరి, మార్చి 23 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం రోహిణీ నక్షత్రంను పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ పరమాత్ముడి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ నర్రా మునిచెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు డి.వి.మురళీకృష్ణమాచార్యులు, రవిచంద్రన్, విష్ణు స్వామి, లక్ష్మీ రాజేష్, జమేదర్ జలంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బంది లేకుండా అన్నప్రసాదాలు



తిరుమల,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి దేవదేవుని దర్శనార్థం వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు వితరణ చేయడంలో ఆదివారం యాత్రికుల వసతి సముదాయం(పిఎసి1)వద్ద అన్నప్రసాద వితరణను పునఃప్రారంభించారు. భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండటంతో పిఎసి 1వద్ద ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు,తిరిగి సాయంత్రం 6.30గంటల నుంచి రాత్రి 9.30గంటల వరకు అన్నప్రసాదాలు పంపిణీ ఉంటుంది.

## కలెక్టరేట్‌లో నేడు వైద్య పరీక్షలు

తిరుపతిరూరల్, ఏఫ్రిల్23 ప్రభాతవార్త: కలెక్టరేట్‌లో సోమవారం తుడా, కలెక్టరేట్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా మొట్ట మొదటిసారిగా చంద్రగిరి నియోజకవర్గం ప్రజలందరికి పెద్దఎత్తున వైద్య పరీక్షలు నిర్వహించి, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ చేసి, రోగం ముదరకుండానే చికిత్స అందించే దిశలో భాగంగా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నడుం భిగించారు. అందులో భాగంగా అసంక్రమిత వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలకు నడుం బిగించారని తెలిపారు.

## వేసవితాపం తీర్చేందుకు మజ్జిగ పంపిణీ




తిరుపతి,ఏప్రిల్23 ప్రభాతవార్త: అక్షయతృతీయ, సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం పురస్కరించుకుని ఆదివారం తిరుపతిలో ప్రజలకువేసవితాపం నుంచి ఉపశమనానికి మజ్జిగ పంపిణీ జరిగింది. రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి ఆధ్వర్యంలో గోవిందరాజస్వామి ఆలయం సమీపంలో భక్తులకు, స్థానికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాసంస్థ సభ్యులు గుణకళ మురళి, దిలీప్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్, చంద్రారెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

# గురుదక్షిణామూర్తికి విశేష అభిషేకాలు

-భక్తిపారవశ్యంలో భక్తులు
-విశేషాలంకరణ, హారతులు




శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తి పూజలు దృశ్యం-పూజల్లో పాల్గొన్న ఎంఎల్ఏ, ఆలయ ఛైర్మన్, ఇఓ భక్తులు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆదివారం గురుసంక్రమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమాలకు విశేష స్పందన వచ్చింది, నవగ్రహాల్లో పంచమ గ్రహమైన గురు గ్రహం, మీన రాశి నుంచి మేష రాశిలోకి ప్రవేశించు శుభ సమయాన దక్షిణామూర్తి ఆలయం వద్ద ఉదయం 9గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా ఆలయ ప్రదానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ సారధ్యంలో ఆలయ పొరోహితులు అర్థగిరి వేదమంత్రాలను పఠిస్తుండగా ఇక్కడి సంప్రదాయం మేరకు పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా మొదట కలశాలను ఏర్పాటు చేసి ఆవాహన గావించారు. తరువాత హోమాలను ఏర్పాటు చేసారు. ఇక ఇక్కడ 108 శంఖాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కరుణాకర్ గురుకుల్ ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి,ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు దంపతులు, ఆకర్షరెడ్డిచే సంకల్పం చేయించారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుంగా డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్,కరుణాకర్ గురుకుల్ శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు.

**అలంకారాలు చూడతరమా?**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లకు జరుగు ఉత్సవాల్లోనూ, అలంకారాల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.దాంతో భక్తులను ఇట్టే ఆకట్టుకుంటున్నారు. ఆదివారం గురుగ్రహం రాశిమారిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో హోమాలు, అభిషేకాలు ఒక ఎత్తు అయితే అలంకారాలు అబ్బో అనిపించాయి. అభిషేకాల తరువాత నిర్వహించిన అలంకారాన్ని చూడటానికి వేయి కళ్లు సరిపోవని విధంగా తీర్చి దిద్దారు. సాయంత్రం నిర్వహించిన చందనాలంకారంను చూడటానికి భక్తులు నిరీక్షించారు. సాయంత్రం గురుదక్షిణామూర్తిని చక్కగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహిం చారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఇఓ వికెసాగర్‌బాబు ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ సతీష్‌మాలిక్,టెంపుల్‌ఇన్స్‌పెక్టర్లు సుదర్శనం, హరియాదవ్, సూపరిం టెండెంట్ నాగభూషణం, ధర్మకర్తల మండలి సభ్యులు మహీదర్‌రెడ్డి సాధన మునస్వామి, బుల్లెట్ శ్యాం, కొండూరుసునీత,పలస సుమతి,రమాప్రభ తదితరులుపాల్గొన్నారు.

## నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్త: భవానీనగర్ 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్‌లైన్ల మరమ్మతులు, రోడ్డువిస్తరణ పనులకు అంతరాయం కలగకుండా రెండు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఇఇ వాసుదేవరెడ్డి తెలిపారు. సోమ,మంగళవారం రెండు రోజులు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పికెలేఔట్, హెడ్‌పోస్టాఫీసు, గంగమ్మగుడి, తుడ కార్యాలయం, రిజిస్ట్రేషన్ ఆఫీసు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.